# దీపావళి

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

లక్ష్మి నాకంటె ఆట్టే చిన్నదికాదు. నాకు అక్కచెల్లెళ్లు లేనట్టే లక్ష్మికి అన్నదమ్ములు లేరు. నాకిద్దరు తమ్ముళ్లన్నా ఉన్నారుగాని లక్ష్మికి తోబుట్టువులే లేరు. ఏక సంతానం. ఆపైన మావి ఎదురెదురిళ్లు కావటంచేత వాళ్ల ఇల్లు నాకూ, మా ఇల్లు లక్ష్మికీ సొంతయిళ్లల్లే ఉండేవి. లక్ష్మిగారిది రెండంతస్తుల మేడ. మాది సామాన్యపు పెంకుటిల్లు. అయినా మా ఇంటిచుట్టూ కాస్త ఆవరణా చెట్లూ ఉండటంచేత లక్ష్మి మా యింటినిచూసి సంతోషించేది. నేనుమటుకు లక్ష్మిగారింటో పాలగచ్చుచూసి సంతోషించేవాణ్ణి.

దీపావళివస్తే లక్ష్మితండ్రి దత్తాత్రేయులుగారు నాకుకూడా టపాకాయలు కొనేవారు. మానాన్నకు దీపావళి సరుకుమీద డబ్బు ఖర్చు చెయ్యటమంటే గిట్టదు. ఆయన 1921 లోనే గాంధీభక్తుడు కావటంవల్ల దీపావళి ఖర్చు పూర్తిగా మానేశాడు.

దత్తాత్రేయులుగారికి దీపావళివస్తే వళ్లు తెలిసేదికాదు. ఆయన ఒక్కసంవత్సరం నలభైయాభై రూపాయలుకూడా తగలేసేవాడనుకుంటాను.

“తగలెయ్యటానికంతంత డబ్బు ఖర్చు చెయ్యటం మంచిదికాదండీ, దత్తుగారూ!” అనేవాడు మానాన్న.

“అంతేనా? ఈ టపాకాయలు కాల్చటంవల్ల విషక్రిములెన్ని చస్తయ్? వాటిని చంపటం మనకువిధి.”

“జీవహింస.”

“అదే మీ కాంగ్రెసు జైనులలోవచ్చిపడ్డది. మలేరియావస్తే నయంచేసుకోరుటయ్యా?”

“ఏదీ? మీరిన్ని దీపావళీలుచేసి ఏమలేరియాను ఆపగలిగారూ?”

“సరే! ఈ దీపావళీ చెయ్యకపోతే రోగాలింకా ఎంత మితిమీరునో.”

“పోనీ ఏకంగా ఒక్క పెద్దదీపావళిచేసేసి అంతటితో పోనివ్వరాదూ?”

“అదీ ఓ ఆలోచనే! కాని ఓ ఆట్టే చిక్కు. ప్రపంచంలోఉన్న విషక్రిములన్నీ చచ్చేటంత దీపావళి తలపెడితే ఆ క్రిములతోపాటు మనుషులంతా చస్తారేమో!”

“అందుచేతే మా కాంగ్రెసువాళ్లకి విషక్రిముల సిద్ధాంతంలో ఆట్టే విశ్వాసంలేదు. మొత్తంమీద క్రిములన్నీ మంచివేగాని వాటిని ఆత్మశక్తిచేత నిరపాయం చేసుకోవాలని మా సిద్ధాంతం!”

“ఆ ఆత్మశక్తి సాధించేదెట్లాగో మీకూ తెలీదూ, మనుష్యులు చావకుండా క్రిములు మాత్రమే చచ్చే దీపావళి ఎట్లాచెయ్యాలో మాకూ తెలీదూ! అందుచేత ప్రస్తుతానికి చిన్నచిన్న దీపావళీలతోనే సాగిద్దాం సరేనా?”

“మీయిష్టం. మీరు ధనికులు. మీరే నష్టంకట్టుకోండి. ఈ దీపావళీల ఖర్చు మామీద పడకుండా ఉన్నంతకాలమూ మీకే అభ్యంతరమూ లేదు. ఈ లోపల ఎవరన్నా మహానుభావులు క్షేమమార్గంచెప్పి ఈ దీపావ

లీల అవసరం లేకుండా చేస్తారేమో! దానికింకా తరుణం రాలేదు,'' అన్నాడు.

ఇది 1940 లో. అప్పుడు నేను మూడో ఫారం చదువుతున్నాను. లక్ష్మి 2 క్లాసులు తక్కువ చదువుతున్నది.

"ఏమోయ్, ఈ దీపావళికి ఏం కాలుస్తావు?" అన్నారు దత్తాత్రేయులుగారు నాతో.

"ఏం కాలుస్తానండీ? ఏమీకాల్చను. ఇంకా ఎన్నాళ్లీ కాల్చటం? పెద్దవాణ్ణి కావటంలా?" అన్నాను.

లక్ష్మికి అదే ఆఖరు దీపావళి. ఆ నాడు మతాబాలు కాలుస్తుంటే వాటి కాంతిలో లక్ష్మిమొహం నా కింకా జ్ఞాపకం ఉంది. ఆ పల్చని మొహమూ, మెరిసే పెద్దకళ్లూ, సన్నని మెడా, చేతులూ—అంతసన్నగా ఉండి అంత నాజూకుగా అందంగా ఉండేవాళ్లు అరుదు.

మతాబాలు కాలుస్తూ వాటిపొగకు లక్ష్మి దగ్గింది.

"ఈ వెధవ మతాబాలు కాల్చీకాల్చీ దగ్గొస్తున్నది, నువ్వన్నా కాల్చు.'' అన్నది నన్ను.

"ఏమీ ఫరవాలేదు, పొగ మీదికి రాకుండా పట్టుకో,'' అన్నాను.

కాని లాభంలేకపోయింది. లక్ష్మి దగ్గు జాస్తి అయింది. కళ్లల్లోకి నీళ్లుకూడా వచ్చినై.

"వెళ్లి కాసిని మంచినీళ్లు తాగమ్మా, అంతగా అయితే కార్తీక పౌర్ణమినాడు మళ్లీ కాల్చుకోవచ్చులే!" అన్నాడు దత్తాత్రేయులుగారు.

కార్తీకపౌర్ణమినాటికి లక్ష్మి మంచంలో ఉంది. వైద్యులుచూసి క్షయ అన్నారుట.

ఈ సంగతి నాకు మాఅమ్మ ఓరోజు రాత్రి నే నింటికి రాగానే చెప్పింది. వెంటనే నేను లక్ష్మిని చూడటానికి బయుద్దేరాను. కాని మా అమ్మ రహస్యంగా నన్ను వెళ్లవద్దన్నది.

"నీకేమన్నా పిచ్చా, అమ్మా! వెళ్లినంత మాత్రంచేతే క్షయవచ్చి చుట్టుకుంటుందా ఏమిటి'' అన్నాను.

"ఏమో, నాయనా, పాపిష్టికాలం,'' అన్నది మా అమ్మ.

"ఏమిటిది, లక్ష్మీ?'' అన్నాను.

"మనం పురుగులన్నిటినీ, చంపలేదు. కొన్నిటిని వచ్చేదీపావళికి ఉంచేశాం,'' అని లక్ష్మి నవ్వబోయి దగ్గింది.

లక్ష్మినిచూస్తే నా గుండె నీరయింది. లక్ష్మి క్షయతో చచ్చిపోయినట్టు ఊహించుకోవటానికి ప్రయత్నించాను. కాని సాధ్యంకాలేదు. ఓ మామూలు యంత్రం అయితే అది పనిచేస్తున్నప్పుడుకూడా అది మూలబడ్డట్టూ విరిగిపోయి



"సునో-సునతా-హూన్"లో విస్మృతింప నేరని మధురభూమిక నిర్వహించిన ప్రఖ్యాత తార వనమాల.

నట్టూ ఊహించుకోవచ్చు. ఓ ప్రాణంగల మనిషి—తన రోగంగురించి నవ్వగలమనిషి—ఆ రోగంతోనే ఎట్లా చచ్చిపోతుంది? ఈక్షయ క్రిములు—కానం మైక్రోస్కోపులో పెట్టి చూడగల క్రిములు—ఏశక్తిచేత మనిషిని మంచంలో పడెయ్యగలుగుతై? ఇది మనిషి మనస్సును అంటలేవుగదా...లక్ష్మిని ఆలోచించకుండా చెయ్యలేవుగదా...మనిషిని ఎట్లా చంపగలుగుతై? చచ్చిపోతే లక్ష్మి మనస్సు ఏమవుతుంది? క్షయతో లక్ష్మిశరీరం ఏమైనా కానీ, లక్ష్మి మనస్సెందుకు చచ్చిపోవాలి? ఇట్లా ఎందుకుజరగాలి?...ఓ మనిషిని వెధవ క్రిములు నాలుగు ఊపిరితిత్తులలోనో గుండె లోనో చేరి చంపేస్తుంటే ఏమీ చాతకానట్టు మిగిలిన ప్రపంచమంతా చూస్తూకూచోట మేనా? ఆ పురుగు లెక్కడుంటయ్యో వైద్యులకు తెలుసుకదా, అక్కడికి ఇంత విషం ఇంజక్షనిస్తే? అసలు మనిషే చస్తుందేమో!... అదేకామాలు ఈ క్రిముల బలం! అసలు ప్రాణియొక్క దౌర్బల్యమే వాటిబలంకామాలు!...దత్తాత్రేయులుగారు చెప్పిందంతా అబద్ధం. మానాన్నే నిజం చెప్పాడు. ఈ క్రిముల్ని చంపటానికి ప్రయత్నించి లాభంలేదు. వాటిని ప్రార్థించిమాత్రం ఏం లాభం? వెధవక్రిముల్ని ఎవరు ప్రార్థిస్తారు? ఆత్మశక్తి? వాటిమీద మన ఆత్మశక్తి ఏంచూపిస్తాం? వాటికదేమిటో అర్థంకాదే! మానాన్న చెప్పిందీ అబద్ధమే...

లక్ష్మిచచ్చిపోతుందనే భయంతో ఏమేమో వెర్రి ఆలోచనలు చేశాను. లక్ష్మి బ్రతికుండగానే ఆమె చావునుగురించి ఆలోచించటం ద్రోహమనిపించింది. కాని ఆలోచించకుండా ఉండటం నాచేతకాలేదు. పైగా లక్ష్మి జబ్బు నయంకావటానికి బాధ్యుణ్ణి నేనే అనిపించింది. ఆ బాధ్యత నిర్వర్తించలేకపోవటం నా అప్రయోజకత్వం అనిపించింది.

నేనదివర కెన్నడూ తెలుసుకోలేను, కాని ఆ మంచంలో శుష్కించిఉన్న లక్ష్మి శరీరం చూస్తే నాకు ప్రపంచంలో లక్ష్మికన్న ఎక్కువైనదేదీ లేదనిపించింది. లక్ష్మి చచ్చిపోయిన తరవాత ఈ ప్రపంచంలో నేను మిగిలిన అందరిమాదిరిగా తిని తిరుగుతూ, ఉద్యోగాలకోసం వెతుకుతూ, ఇడ్లెన్లకోసమూ, కాఫీకోసమూ, సినిమాలకోసమూ ఆరాటపడుతూ ఎట్లా కాలం వెళ్లబుచ్చుతానో అర్థంకాలేదు. లక్ష్మి చచ్చిపోయిన మరుక్షణంనించీ ఆకాశం మబ్బుకమ్మేసి ఆ మబ్బు ఇక ఎప్పటికీ విడదనిపించింది.

కాని లక్ష్మి వైద్యులసహాయంతో కోలుకున్నది. చిక్కి కళాహీనమైన ఆమె మొహం లోకి తిరిగి రక్తంవస్తున్న లక్షణాలు కనిపించినై.


"డాక్టర్లు మదనపల్లి పొమ్మన్నారు," అని చెప్పింది లక్ష్మి. నాకు చాలా సంతోషం వేసింది.

"నేను పెద్దవాణ్ణయితే డాక్టర్నవుతాను లక్ష్మి," అన్నాను.

కాని నేను డాక్టర్నెట్లా అవుతాను? స్కూలు ఫైనలు కాగానే నన్ను మానాన్న సంపాదనలో దించాలని చూస్తున్నాడు. డాక్టరుకావాలంటే చాలా డబ్బవుతుంది. ఈ దీపావళికిచేసే ఖర్చంతా మానేస్తే ఎంతమంది డాక్టర్లు తయారుకావచ్చు?

మదనపల్లినుంచి అనుకోకుండా లక్ష్మిదగ్గర్నించి ఉత్తరం వచ్చింది.

"నాకు మళ్లీ జెంప రేచరువస్తున్నది.... నువ్వీపాటికే డాక్టరై ఉంటే ఎంత బాగుండేది..." అని రాసింది లక్ష్మి.




కాని నాకీసారి భయంవెయ్యలేదు. అక్కడ లక్ష్మిని చాలామందిడాక్టర్లు కనిపెట్టిఉంటారు. లక్ష్మిప్రాణం నా చేతుల్లోఉన్నదనుకుని భయపడ్డాను. కాని డాక్టర్లచేతిలో ఉందని తెలిసిన తరవాత ఇంకేభయమూలేదు.

నాకు పరీక్షలు. ఆ అడావుడిలో ఉన్నాను. నేనింకా ఇద్దరు ముగ్గురు స్నేహితులతోకలిసి చదువుతూ ఉండటంవల్ల ఇంటో పడుకోవటం లేదు.

ఓ రోజు సాయంకాలం నేను అడావుడిగా ఇంటికొచ్చి, "వెంటనే అన్నంపెట్టమ్మా. మళ్లీ త్వరగా చదువుకునేటందుకు వెళ్లాలి," అన్నాను.

"విన్నావా, పాపం, లక్ష్మిపోయిందిట," అన్నది మా అమ్మ.

"ఏ లక్ష్మి?"

"మన దత్తాత్రేయులుగారమ్మాయిరా."

నా కర్థంకాలేదు.

"ఎక్కడికి పోయింది?" అన్నాను. కాని మరుక్షణమే నా కర్థమయింది. నా మొహంలో మార్పునుచూచి మాఅమ్మఇంకేమీ అనలేదు.

నేనా రాత్రి చదువుకునేటందుకు వెళ్లలేదు. ఇంటోనే దీపం ఆర్పేసి చీకట్లో లక్ష్మి మొహంకోసం చూస్తూపడుకున్నాను. డాక్టర్లు లక్ష్మికేంచేశారు? ఆ మాట లక్ష్మి నడిగాను. నేను డాక్టర్నుకాననికూడా లక్ష్మికి చెప్పాను. అయి ఏం లాభం? ఎంతమంది డాక్టర్లు అడుక్కుతినటంలేదు? నన్నేంకమ్మన్నావని లక్ష్మిని అడిగాను. లక్ష్మి సమాధానం చెప్పలేదు....